## కథ

# మా దొడ్లో కల్పవృక్షం

- వీరాజీ

కరివేపాకు నుంచి బంగారం చేయడం ఎలాగంటారా? అది చాలా కష్టం. కష్టమే గాని అసంభవం కాదు.

000

రంగరాజమ్మగారు మా ఇల్లుగలావిడ కనుక నేను ఇలా చెబుతున్నాను అనుకోవద్దు. నిజంగా ఆవిణ్ని ఎవరు చూసినా, మాదొడ్డ ఇల్లాలనే చెప్పుకుంటారు. ఏబయ్యోపడి తొంగిచూస్తూ ఉన్నప్పటికీ, ఆమెకు భగవంతుడు అందమైన మెడ నిచ్చాడు. ఆరోగ్యమైందది. కనీసం నూట యాభై, రెండు వందల గ్రాములకు తక్కువ బంగారం ఆమె ఏ సమయంలోనూ ధరించదు. ఐనా నాకా బంగారం మీద ఆశా లేదు, అక్కసూ లేదు. ఎందుకంటే ఈ మహానగరంలో ఆవిడే కనుక ఇల్లు అద్దెకు ఇవ్వకపోతే, నేను, నా పెళ్లాంపిల్లలతో అల్లాడిపోదును.

ఈ వూరి సంగతి మీకు తెలియదు. ఇక్కడ అద్దెకు కొంప కావాలీ అంటే జీతం రాళ్లు తెచ్చుకుంటూ, పెళ్లాంపిల్లలతో కలో గంజో త్రాగి బ్రతుకుతాను అన్నవాడికి మాత్రం అంత సుళువుగా దొరకదు.

"అందుకనే మీరే శిక్షయినా వేయండి. కావాలంటే మీ ఇల్లు కాపలా కాయమన్నా 'జో హుకుం'గానీ ఈ శిక్ష మాత్రం వద్దు! ఈ ట్రాన్స్‌ఫర్ చేయకండి" అని నే మొత్తుకున్నాను.

"బెజవాడ మహాపట్నంలో మొదటిది కొంప దొరకదు. దొరికినా అందులో నీళ్లు దొరకవు. ఈ రెండూ ఉన్నా, ఇల్లు గల వాళ్లవి ఏనుగుదాహాలు! ఇదంతా అలా వుంచి అసలే బక్క శరీరం వాణ్ని. దీన్ని నా పెళ్లాంపిల్లలకీ గాకుండా దోమలు భోంచేస్తాయి" అని మొత్తుకున్నాను.

వింటేనా? మా యజమాని వాసుదేవరావు గారు! "పైగా అటు మీ అత్తవారింటికీ, ఇటు మీ తాతగారి ఊరికీ కూడా దగ్గరగా వుంది. పర్వాలేదు. ఇదే గొప్ప ఛాన్సనుకో!" అన్నారు.

సరే! నేను మా ఆవిణ్నీ, ముగ్గురు పిల్లల్నీ మా మామగారింట్లో వదిలేసి వచ్చి, ఇక్కడ భోజనం టిక్కెట్ల పుస్తకం కొనుక్కున్నాను. అయితే వాళ్లు మాత్రం రెండేళ్లు భరించగలరా? అందుకనే ఇల్లు వెతుకుతున్నట్లే చెప్పి వదిలివచ్చాను.

ఆపద్బాంధవుడిలా మా చిన్ననాటి మిత్రుడొకడు ఇక్కడే వుంటున్నాడు. వాళ్లింట్లో (పెళ్లాం వాడికి ఒక్కర్తే లెండి! పురిటికి వెళ్లింది) వాడి ధర్మమా అని, ఆ పంచనే మేం ఇద్దరం పేకాడుకుంటూ పడుంటున్నాం.

కాని మా ఆవిడ ఈ లోగా కాకిగోల మొదలెట్టింది. ఇలా ఉత్తరాలు రాసేది.

"చి. సుగుణకు కాస్త రొంపా, జలుబూ చేశాయి. మీ కోసం దిక్కులు చూస్తోంది. నానిగాడు గుమ్మం తగిలి పడిపోయినాడు నిన్న మధ్యాహ్నం. కొంచెం ముక్కు మీద దెబ్బ తగిలినది. నాకు మాత్రం మీరు లేనిదే తోచును గనుకనా? దోమలు ఎక్కడ లేవు కనుక? అంతగా అయితే దోమతెరలు కొనుక్కోవచ్చును. నీళ్లా? అవి ఎక్కడ వస్తున్నాయి కనుక? బావిగల ఇల్లు చూడండి, పప్పు ఉడికే నీరు ఉన్న చాలును. రాత్రుళ్లల్లో మీరు ఎలా ఉంటున్నారో ఏమో, నాకు మాత్రం కునుకు వచ్చుట లేదు... దోమలకు భయపడి కాపురాలు మానుకుంటామా?"

కార్డు మీదే ఒక రామాయణం రాయమన్నా రాస్తుంది, మా ఆవిడ. అక్షరాలు ఆవగింజలంతేసి ఉంటాయి కనుక పర్వాలేదు.

అందుచేతనే గృహాన్వేషణ కార్యక్రమం సీరియస్‌గా మొదలెట్టాను. కొందరిని 'బాబ్బాబూ' అన్నాను. కొందరి చేతులు పట్టుకుని "ఇవి కాళ్లు" అన్నాను. ఇలా వెతుకుతూవుండగా, రావు ఆపద్బాంధవుడిలా కనపడ్డాడు.

"ఫలానా చోట ఇక ఇల్లు వుంది" అని చెప్పాడు.

"చచ్చి నీ కడుపున పుడతాను. కాస్త వచ్చి చూపెట్టనయ్యా బాబూ!" అంటూ ఉండగానే వాళ్లావిడ సినిమాకి వెళ్లాలందిట, ఎదురుచూస్తూ ఉంటుందిట. పారిపోయాడు. కొత్తగా పెళ్లయింది లెండి. వాడి ధర్మమా అని ఆ వీధి పేరు చెప్పాడు. "కరివేపాకు చెట్టు పెద్దది ఉంటుంది. అదే ఆనవాలు" అని కూడా చెప్పాడు. వెళ్లాను.

అది మేడ యిల్లే. దూరం నుంచే నా కంటికి ఒయాసిస్సులా కనపడ్డది. అదే కాబోలు కరివేపాకు చెట్టు. అంతెత్తుంది. మేడ మీద నుండి నాలుగు రెమ్మలు కొసుకుంటే చాలు. చెట్టెక్కను కూడా అక్కర్లేదు అనుకున్నాను. కాని దగ్గరగా వెళ్లేసరికి, నాలోని ఈ ఉత్సాహం సగమైపోయింది. ఇంత పెద్ద ఇల్లు! అద్దెకిస్తారా? అని నేనే మొహం పెట్టుకుని అడగనూ?

కాని పట్నవాసాల్లో ఒక్కో మేడను ఎనిమిదేసి, పదేసి భాగాలు చేసి పది-పదిహేను కుటుంబాలకు ఇచ్చే ఆచారం వుంది కదూ? అందుకనే గేటు మీద "కుక్కలున్నాయి జాగ్రత్త" అనే బోర్డు కూడా లేదు.

గేటు తీసుకుని లోపలికి వెళ్లాను. నాకు లౌక్యం తెలియదని మీరనుకోవద్దు. అక్కడే ఒక పెద్దమనిషి నెరసిన బట్టతలా,



కొంచెం ముడతలు పడ్డ మొహంతో పడక్కుర్చీలో కూచొని చుట్ట కాల్చుకుంటున్నాడు.

"ఏమండీ...1"

మాట్లాడలేదు.

"చూడండి..." అన్నాను.

'చుట్ట కొసను మధ్య మధ్య వెనక నించి తగ్గిపోతుందా? అన్నట్లు చూస్తూ... చప్పరిస్తూ... 'సరే చూశాను' అన్నట్లు అతగాడు తల ఎత్తి చూశాడు.

నేను వినయంగా, "ఇక్కడ ఇళ్లేమైనా ఖాళీగా ఉన్నాయాండీ?" అడిగాను.

"ఆవిడ లేదు. గుళ్లోకి వెళ్లింది."

మళ్లీ మా బావమరిది డిటెక్టివ్ పుస్తకపారాయణం చేసుకునేంత దీక్షగా ఆయన తన చుట్టలో మునిగిపోయాడు!

"ఈ ఇంట్లోనే కదండీ ఇల్లు ఖాళీగా వుందీ?"

"ఉంటే?" చుట్ట తీసి మళ్లా నోట్లో పెట్టుకుని, దళసరి కనుబొమల క్రింద నుంచి నన్ను వె ళా కో ళ ం గా చూశాడు.

లేదా నేనలా అనుకున్నాను.

"మాకు కావాలండీ."

"మా ఆవిడ ఇంట్లో లేదు. రేపు రారాదుటయ్యా?"

నేనేం బాకీలవాణ్నిటండీ! ఆ పెద్దమనిషి అలా విదిలిస్తాడెంచేతా? అయినా అవసరం మనది. మా తాతయ్యకు కొంప కట్టాలనే జ్ఞానం లేకనేగా ఈ అవస్థలన్నీ అని, చచ్చి స్వర్గాన వున్న మా తాతయ్యను తిట్టుకుని-"కాదు సార్! ఓసారి చూపిస్తే..." నసిగాను.

అతను మీసాల వెనుక నించి నవ్వాడు. "ఎట్టా చూపించమన్నావ్? తాళాలేం నా బొడ్డుకున్నాయనుకున్నావా? మా యావిడ కొంగునున్నాయ్! ఇంతకీ నీకేమాత్రం ఇల్లు కావాలీ?"

ఇలా ఏకవచనప్రయోగం, ఇంత త్వరగా, ఎంత ముసిలాడైతే మాత్రం చేయడం నాకు నచ్చలేదు. కాని అవసరం నాది. ఇల్లు కావల్సింది నాకు, కనుక వ్యాకరణదోషాలూ, గట్రా, కాసేపు మరిచిపోదామనుకున్నాను.

"ఇల్లేమాత్రం అని చెప్తానులెండి. నేనూ, పెళ్లాం, ముగ్గురు పిల్లలు... అంటే అంతా పనివాళ్లేలెండి" చెప్పాను.

"ఏ వూరూ?" అన్నాడు.

"ఉద్యోగులం. ఒక వూరనేమిటి లెండి? పూర్వం ఇక్కడే శివాలయం వీధిలో ఉండేవాళ్లం, తర్వాత సామర్లకోటా, దరిమిలా వాల్తేరూ... ఇప్పుడు మళ్లీ..."

"సరే... వాటాలంటూ లేవుగాని ఈ క్రింది పోర్షన్ ఉంది. కావాలా?" అన్నాడు.

ఇక మొహమాటమెందుకు?

"అద్దె ఎంత? ఎన్ని గదులూ? బావి వున్నదా? పంపులో..."

"...ఏమయ్యోయ్! ఆగు ఆగు. ఆ వ్యవహారమంతా నాకు తెలియదు. ఆ కరేపాకు చెట్టు చూశావా?" అన్నాడాయన, మధ్యలోనే నన్ను ఆపి.

"ఆహా!" అన్నాను. నాకు "కరివేపాకూ కల్పవృక్షమూ" అనే వ్యాసం రాయాలనే కాంక్ష ఉండేది చిన్నప్పుడు. ఏ మాస్టారూ అడగలేదు, నేను రాయలేదు.

చారులో వేసుకోవచ్చును కరివేపాకు. కూరల్లో సరే సరి. పోతే ఉప్మాలో అది లేకపోతే మజాయే లేదు...

"దానికెంత తెలుసో, నాకూ ఈ వ్యవహారాలంతే తెలుసు. ఫో! రేపు రా!" అని ఆ పెద్దమనిషి నా ఆలోచనా తరంగాలను తెంపేశాడు.

రేపెంత దూరం కనుక! వెళ్లిపోయాను. మా వాడింటికి వెళుతూనే కాయితం, కలం తీసుకున్నాను. మా వాడు పేక కలుపుతున్నాడు.

"సారీరా! బ్రదర్! ఇవాళ ఉత్తరం రాయాలి" అన్నాను.

వాడు నోరు విప్పేశాడు. "ఏమిటీ కథ?" అన్నాడు. "ప్రేమలేఖా?" అని అడిగాడు.

"పెళ్లానికే!" నవ్వేస్తూ గట్టిగా చెప్పాను.

"ఇల్లు దొరికిందా భాయ్! ఇక నీకు కూడా మీ చెల్లెలు (మా యావిడ అన్నమాట) ఝింత ఉ డ [illegible] పడేసేరోజులొచ్చాయ్" అన్నాను.

"అచ్చా!" అన్నాడు వాడు, వాడికి వాడే పేకముక్కలు పంచేసి ఎత్తి చూసుకుంటూ!

నేను ఉత్తరంలో పడ్డాను. బహుశా నా తొలి ప్రేమలేఖ అయ్యుంటుంది అది. మా ఆవిడకే కాదు. మరెవరికీ యిది రాయలేదు. ఒక్క ఉద్యోగం, 'లోను' కోసం తప్ప, నేను ప్రేమలేఖ రాసిన జ్ఞాపకం లేదు.


"...కరివేపాకు చెట్టు వుంటే కల్పవృక్షంతో సమానమని అనుకునే వాళ్లం కదూ. ఆ ఇంట్లో చాలా పెద్ద చెట్టు ఉంది. కరివేపాకు గురించి ఆయుర్వేదంలో ఎంతేనా చెప్పారు పెద్దలు. అది సర్వరోగనివారిణి అనుకో. దాన్ని రోజూ కోసి చారులో వేసుకో వచ్చును. పప్పుకట్టులో, కూరలో, పులిసిన మజ్జిగలో పోపుతో పాటు కరివేపాకు వేస్తేనే మజా...

"ఇంకా దాన్ని వేచి, మిరపకాయలూ, మినప్పప్పూ కలిపి దంచుకుంటే కారప్పొడి అవుతుంది. ఇది ఇడ్లెన్లలో నంచుకుంటే అమృతంలా ఉంటుంది. నూకలకీ, గింజలకీ తప్ప కరివేపాకు అమ్మరూ అంటే ఎందుకనుకున్నావ్? దాని విలువ అపారం కనుకనే!

"అలాంటి కరివేపాకు మహా వృక్షం నీడలో మనకి ఒక ఇల్లు చూశాను. ఇంటి పెత్తనం ఇల్లాలిది కాబోలు, ఆ వెర్రిబాగుల మొగుడు రేపు రమ్మన్నాడు. ఆ ఇల్లాలు ఇస్తుందనే ఆశ వుంది. నా అంతరాత్మ అలా చెపుతోంది. నువ్వూ, పిల్లలూ సిద్ధంగా వుండడండి. నేనీ నెలాఖరుకు మిమ్మల్ని తీసుకుని వస్తాను. ఖాయం...!" మిగతా లాంచనాలన్నీ ఉంటాయిగా ఉత్తరానికి. అవి పూర్తిచేశాను. ఇంగిలీషులో సంతకం చేశాను. మా ఆవిడకు రాదు కాని పోలుస్తుంది లెండి. పోస్టులో పడేశాను.

"అమ్మయ్య! ఈ ఊళ్లోకూడా ఒక్క మంచి కొంప సంపాదించా"నని

"మా ఆవిడ ఇంట్లో లేదు. రేపు రారాదుటయ్యా?"
నేనేం బాకీలవాణ్నిటండీ! ఆ పెద్దమనిషి అలా విదిలిస్తాడెంచేతా? అయినా అవసరం మనది. మా తాతయ్యకు కొంప కట్టాలనే జ్ఞానం లేకనేగా ఈ అవస్థలన్నీ అని, చచ్చి స్వర్గాన వున్న మా తాతయ్యను తిట్టుకుని-"కాదు సార్! ఓసారి చూపిస్తే..." నసిగాను.
అతను మీసాల వెనుక నించి నవ్వాడు. "ఎట్టా చూపించమన్నావ్? తాళాలేం నా బొడ్డుకున్నాయనుకున్నావా? మా యావిడ కొంగునున్నాయ్! ఇంతకీ నీకేమాత్రం ఇల్లు కావాలీ?"



నిట్టూర్చాను.

000

మేమీ ఇంట్లో దిగిం తర్వాత, వారం తిరగ కుండానే నా శ్రీమతి చాలా విషయాలు చెప్పింది. ఆడాళ్ల మాటలు పట్టుకుని మనం తగూలకి వెళ్లకూడదు. అందులోనూ మన మీది అంతస్థులో-నా ఉద్దేశంలో మేడ మీద అని కూడా-ఉన్న ఇంటిగలవాళ్లతో పోట్లాడటానికి కాస్త వెనుకాడాలి!

వాళ్లు తొక్కు పొయ్యొచ్చు మన మీద, లేదా రాత్రుళ్లు మంచాలు బరాబరా ఈడుస్తూ మనకు పీడకలలు తెప్పించవచ్చు. లేదా తూముల్లో మురికినీరు పోసేయొచ్చు. పెరట్లో మన మరుగు గదులకేసి అదే పనిగా చూస్తూ ఆడా, మగా, పనీపాటా, స్నానంగీనం చేసుకోకుండా ఏడిపించుకు తినవచ్చును. ఇవన్నీ పైన ఉన్నవాళ్లకు గల అవకాశాలు. వాళ్లు ఇంటిగలవాళ్లే అయితేనా?

కరివేపాకు దగ్గరే తగువు రావడం నా మనసుకు చాలా నొప్పనిపించింది. పోయిన శుక్రవారం అసలు పెరట్లో వున్న గోరింటాకు దగ్గర వచ్చిందట ఈ తగవు.

మా సుగుణ గోరింటాకు కోసుకుంటోందట. రంగాజమ్మగారు మేడ మీద నుంచే ఈ దృశ్యాన్ని చూసి అక్కణ్నుంచే కొంప లంటుకుపోయినట్లు కేకలేశారట.

"అయ్యయ్యో! నీ చేతులు పడా... అలా చెట్టంతా దూసుకుంటున్నావ్ యెవరబ్బ ముల్లే?" అంటూ చాలా అమర్యాదగా ఆవిడ కేకలు వేసిందిట. మా ఆవిడ చెప్పిన మాటలలా ఉన్నాయి. నేను ఆ రోజే ముసిలాయన్ని అడుగుదామనుకున్నాను.

కాని నేను మెట్ల దగ్గరకు వెళ్లేసరికి పైనుండి రంగరాజమ్మగారి కంచు కంఠం మ్రోగుతోంది.

"ఇల్లుగలావిడ ఆయన్ని" అని సగర్వంగా చెప్పుకునే మా ఇంటిగలాయన మీదే ఆవిడ అంగవిన్యాసయుక్తంగా కేకలు వేస్తోంది.

"నా యిల్లు నా యిష్టం...! పిల్లా, పీచూ లేనంత మాత్రాన, కొంప పందికొక్కులకీ, దొంగలకీ దోచిపెట్టుకుంటామా?" అంటోందావిడ.

నాకు ధైర్యం చాల్లేదు.

పైగా మొగుణ్నే "చాతకానివాడివి. నా కడుపునో 'కాయ' ఇవ్వలేనివాడివి..." అదీ ఇదీ అంటున్నదే ఆమె...? నన్ను ఇంకా ఏమేనా అనొచ్చును. నేనాఫీసుకి వెళ్లిపోయాను. కాని మళ్లీ ఇవాళ కరేపాకు దగ్గరే వొచ్చింది తగవు.

రంగాజమ్మగారి వాదంలో కొంత అర్థముంది. లేకపోలేదు. నేను ఆ ఇంట్లో అద్దెకు దిగానే కాని, పెరట్లో వున్న మొక్కలకీ, చెట్లకీ, చేమలకీ అద్దె ఇవ్వటం లేదుగా...?

కరివేపాకు, మొదట్లో మా సుగుణను పిలిచి ఇచ్చేది. మేడ మీదకు "ఒసే పాపా! ఇలా రా!" అంటూ పిలిచి మరీ, "కరివేపాకు కొనకండి, నూకలు మాత్రం ఈ కరవు కాలంలో వూరికే వస్తాయా?" అంటూ నాలుగు రెమ్మలు ఇచ్చేది.

కాని నేనే వెర్రి వెధవలా ఈ పోట్లాటకు కారణం అయ్యాను. ఉదయం లేచి మొహం కడుక్కోకమునుపే ఒక వెదురువాసం తీసుకుని, దానికి కత్తిముక్క కట్టి, పాపకిచ్చాను.

"వెధవ నాలిక. దానికి రుచులు కావాలి గదండీ. పైగా కరివేపాకూ కల్పవృక్షమూ అంటూ నన్నీ నరకకూపంలో పడేశారు. పిల్లా, పీచూ లేరు. వెనకా, ముందూ లేరు కదా! ఆవిడకెందుకండీ అంత పిసినారితనం?" అంటుంది.

కరివేపాకు కోయడానికి కూడా అభం శుభం ఉంటాయా? పైగా శనివారంట. వేంకట్రమణమూర్తికి అతిప్రియమైనదట. కరివేపాకు కోయకూడదట. పిల్లల చేతులు ఎర్రగా కందిపోయేలా లాక్కు పోయిందండీ కోసిన కరివేపాకంతా...

అలా మా ధనమ్మ' నన్ను పట్టుకు దంచేసింది.

తప్పంతా నాదేనన్నా వూరుకోరు కదా!

మర్నాడు ఉదయమే ఆదివారంగా.

ఇడ్డెన్లలోకి ఉల్లికారమే నూరుకుంటున్నాం. అంటే ధనం నూరుతోంది. రంగాజమ్మగారు మేడ దిగి తులసికోటలో నీళ్లు పోసుకునేందుకు వచ్చారు.

నన్ను చూసి అదోలా అయిపోయి, పైట మరీ ఇలా లాక్కుని అటు మొహం తిప్పి, నీళ్లు కోటలో పోసి, తీసి నెత్తిన జల్లుకుని, తులసిదళం కోసి, నోట వేసుకుని పోతూ... "ఇవాళ ఆఫీసు లేదా బాబూ?" అన్నది.

"ఆదివారంగా..." అన్నాను. ఆవిడకు ఏడు పుట్ల ఆముదం ఉడుకుతున్న నా మొహం యిక చూడగల శక్తి లేకపోయింది కాబోలు, వెళ్లిపోయింది. ఆవిడ మెట్లన్నీ ఎక్కాకా నాకు వొళ్లు మండిపోయింది.

"ఇలాంటి వాళ్లే గోవును చంపి చెప్పులు దానమిస్తారు" అన్నాను.

మా ఆవిడ నవ్వుతూ వెటకారంగా, "ఎవరితో రహస్యం మాట్లాడుతున్నారూ?" అన్నది రోటి దగ్గర్నుంచే.

'అంటే చవటా! రంగరాజమ్మగారి దగ్గర నీకు భయమూ' అని అర్థం. నిజం చెప్పకేంగాని... నాకు ఆవిడంటే కాస్త భయమే. మా ఆవిడన్నా వుందనుకోండి. అది వేరే సంగతి.

చుట్ట చప్పరిస్తూ... ఆ తర్వాత ముసిలాయన అనగా మా ఇల్లుగలావిడ ఆయనన్నమాట! వచ్చాడు.

నిన్నటి తగాదాకు స్వస్తి చెప్పాల్సి వుందిగా మరి!

చెప్పాడు.

"పర్వాలేదు లెండీ. మనలో మనకేమిటీ?" అన్నాను.

అసలు పిల్ల కరేపాకు కత్తి కర్రతో కోస్తున్నందుకు కానేకాదుటా, రంగాజమ్మగారు పోట్లాడింది. ఆ కరేపాకు చెట్టు మీద ఒక కాకి గూడు పెట్టుకుంది. అందులో గ్రుడ్లున్నాయి. అవి ఆ కాకివేనని ఆమె నమ్మకం. వాటికి ఈ కర్ర ఎక్కడ తగిలి పడిపోతాయోననే ఉద్దేశంతో "అలా కాస్త కేకలు వేసిందిట" అంతే...

నాక్కూడా ఈ కారణం సబబేననిపించింది. "పోనీలెండి. కరేపాకేం భాగ్యమా? బంగారమా? కొనుక్కుందాం" అన్నాను.

ముసిలాడు దీనికి సమాధానం "సరే" అనాలో, "లేదు" అనాలో అనుకున్నట్లు లేదు. అంచాత "అమ్మమ్మ!" అన్నాడు ముక్కు మీద వేలేసుకుని.

మా ఆవిడ వొళ్లు మంట తీర్చుకుందికి "అదీ తప్పేనా? బాబయ్యగారూ! అమ్మ పెట్టా పెట్టదు... అడుక్కూ తిననియ్యదూ

అని సామెతట" అన్నది.

ముసిలాడు లేని సత్తువ తెచ్చుకుని లేచి మరీ గబగబా వెళ్లిపోయాడు.

నేను, మా ధనాన్నీ, పిల్లల్నీ ఆ రోజు మ్యాటినీకి తీసి కెళ్లేదాకా అలా "అది" (నా ఇల్లాలు) కారాలూ, మిరియాలూ నా మీద నూరుతూనే ఉంది.

మా ధనం చెప్పింది. అసలు కాకిగూడూ కాదూ... వెంకటేశ్వర స్వాములవారి భక్తీ కాదుటా. రంగాజమ్మగారి కరివేపాకు "కక్కుర్తి" (మా ఆవిడ మాటల్లోనే) అంతా అమ్ముకుందికేనట.

అమ్మడం! ఇంత ఇల్లూ, అంత పెరడూ, అంత మొగుడూ, మెడ నిండా బంగారం... పైగా పిల్లా పీచూ లేదు. అతనికి "పింఛను" వస్తుంది కూడా కదా! కరివేపాకు ఎందుకు అమ్ముతుందీ?

మా ధనం ఆమటలు కాదనటానికి ధైర్యం కావాలి. అంతలో సుగుణ చెప్పింది. "అమ్మమ్మగారేం (అంటే రంగరాజమ్మగారు) మొన్న మా బళ్లో అమ్మాయి సుమతికి పదిహేను పైసలకి ఇంత గోరింటాకు ఇచ్చారు నాన్నారూ" అని...

రంగరాజమ్మగారంటే నాకు గల భక్తి పోయింది. "భయం పోయిందా?" అనడక్కండి ఇల్లుగలావిడంటే ఎవరికైనా అది పోదు. "పిల్లలున్నవాళ్లకైతే ఇలాంటి దానం, ధర్మం, భూతదయా వుంటాయ్. లేనివాళ్లకేంటిటండీ?" అంటోంది మా ఆవిడ. దాని కెవరిమీదైనా కోపం వస్తే చాలు. ఇక వాళ్ల నీడక్కూడా అది అష్టవంకరలూ, అరవై లోపాలూ పెట్టగలదు.

రంగరాజమ్మగారి మెడలో వున్న బంగారం అంతా ఆమె సొంతమట! ఇల్లు ఆమె పేరనే వుంది. తాళాలు ఆమె బొడ్డులోనే వున్నాయి. నా ముక్కు పిండి అద్దె ఆమెగారే అందుకుంటుంది. అంతా అమ్మగారి పెత్తనమే! అయ్యగారిదేమైనట్లూ?

ఏమో కాని... నేను మాత్రం కరివేపాకు విషయం మరచిపోదామనుకున్నాను. గాలీ, వెల్తురూ పెరడూ, గిరడూ, పంపూ గింపూ లాంటి సౌకర్యాలు గల ఇల్లు, తపస్సు చేసినా దొరకదు. కాని కరివేపాకుతో లేహ్యం చేసుకుంటే నిజంగా జాండీస్ రాదుట. మా ఆఫీసు బోయ్ చెప్పాడు.

ప్చ్ ఏం చేస్తాం... ఎప్పుడేనా ఆవిడ వూరెళ్లదా? (ఛీ ఛీ! దొంగ బుద్ధి! లెంపలేసుకున్నాను)

మళ్లీ ఆదివారం వచ్చింది. మామూలుగానే నేను పేపరు చదువుకుంటున్నా, ఒక ముతక మనిషి ఉంగరాల జుట్టూ, కాకిరంగు పంచె అవీ ఉన్నాయి-వచ్చాడు. గేటు తీసుకుని లోపలకు వచ్చాడు. మేడ మీదకు వెళుతున్నాడు.

మనకేంలే అని వూరుకున్నాను. మనిషి కాయకష్టం చేసే వాలకంగానే వున్నాడు. సైకిల్ మీద వచ్చాడు.

మా ఆవిడ పొయ్యి మీద గిన్నె కింద పడవేసి వచ్చింది. మా చంటాణ్ని ఎత్తుకోమంటుందేమోననుకొంటున్నా. కాదు, "చూశారా? పైకి ఇలా వెళ్లాడే. వాడికే. పోయిన శుక్రవారం పొద్దున్నా ఆమె రొడ్డలకి రొడ్డలు కరివేపాకు, రూపాయిన్నర పుచ్చుకుని అమ్మేసింది" అన్నది రహస్యంగా.

"అలాగా!" అన్నాను.

కాకి గూడు పడిపోలేదా? అనుకుని చెట్టు మీదకు చూశాను. చెట్టు కొమ్మల మధ్య కాకి గూడు వున్నది. కాని, కరివేపాకులు మాత్రం అంత దట్టంగా లేవు.

"పోన్లే! మనం కొనుక్కుందాం" అన్నాను.

"ఏం మనుషులో, ఛీ!!" మా ఆవిడ మూతి విరిచి (తనది) ఒళ్లు కూడా తిప్పుకు నన్ను యీసడించి వెళ్లిపోయింది.

"పైసా విలువ తెలియనిదే బంగారం విలువా తెలియదూ!" అంటుంది రంగరాజమ్మగారు. కాని నాకు కరివేపాకు గురించి యిన్ని రకాలు తెలుసును కాని, ఇలా అమ్మొచ్చును అని కూడా తెలియదు.

ఆ ముతకమనిషిని అడిగాను. "ఏమయ్యా! మేకలకా?" అని.

"కా"దన్నాడు.

"మరెందుకూ"?

నీకెందుకయ్యా అన్న ధోరణిలో చూసి, "అమ్మడానికి"-అంటే అమ్మేటందుకు అని అర్థం-అన్నాడు.

"అలాగా" అన్నాను.

"మరేమండీ" అన్నాడు.

[illegible]

"ఓహో! ఎలా దూసేశాడు? చెట్టుని క్షవరం చేసేశాడు" అన్నాడు మా నానిగాడు.

కరివేపాకు అబ్బి అదంతా మూటగట్టి సైకిల్ మీద తీసుకు పోయాడు.

నేను దుఃఖంగా చూస్తూ వూరుకున్నాను. అయినా ఉండబట్టక, పోయేవాణ్ని పిలిచి, "మళ్లీ వారం వస్తావా"? అన్నాను.

"చూద్దాం! అప్పటికెవరెక్కడుంటామో" అన్నాడు వాడు.

వీడి వేదాంతం మండా!

"నన్ను ఇల్లు ఖాళీ చేయిస్తా"నని వీడికి రంగాజమ్మ చెప్పలేదు కదా! అదే పోత పోయాడు.

నాకో అయిడియా వచ్చింది. నేనూ ఒక మారువేషం వేసుకోడం, పెద్ద గోతాం తీసుకుని రావడం. బుర్రమీసాలూ, చేతికడియాలూ అన్నీ పెట్టుకోవాలి మరి. సినిమాల్లోలాగ "అమ్మా! (బొంగురుగా) రంగాజమ్మగారూ!" అనడం, "నాకు కరివేపాకు మందులు చేయడానికి కావాలి! ఉచితం కాదు. పదిరూపాయలిస్తాను. మీ చెట్టు శాస్త్రరీత్యా శ్రేష్టమైంది. అందుకే ఈ బంగారం లాంటి కరేపాకుకి పది అణాలకు బదులు పది రూపాయలు ఇస్తాను" అనడం.

దాంతో ఆవిడ ఎగిరి గంతేసి (అంటే సంబరంగా అన్నమాట) ఒప్పుకుంటుందిగా. కరేపాకు అంతా క్షుణ్ణంగా కోసి గోతాంలో కెత్తుకుని, దిగి సైకిలెక్కి అదే పరుగున పారిపోడంటా... (పది రూపాయలూ లేదూ, గిది రూపాయలూ లేదూ)

ఇలా నేను పగటి కలలు కంటూనే వున్నానూ... మేడ మీద నుంచి కెనడా ఇంజిన్‌లా "భా భా" మంటూ మా ఇల్లు గలావిడ కేకలు!

"ఓరి నీ మొహం తగలయ్యా నీ కడుపుడకా! నా కరేపాకునంతా ఆదివారం పొద్దూ అనక దూసుకున్నావట్రోయ్" అంటూ ఆవిడ బంగారం పోయినట్లే క్రిందకి వస్తోంది.

నా గుండెలు జారిపోయాయి. నేను వూరికే లోపల లోపల అనుకుంటున్నానే. కొంపతీసి అదే ఈవిడ పసిగట్టలేదు కదా!

లేచి నిలబడి "అబ్బే! అబ్బే! ఏమీ లేదే!" అన్నాను.

"అయ్యో, ఏమీ లేదంటావేం బాబూ! ఆ దొంగ వెధవ, నీ కళ్ల ముందేగా చెట్టంతా దోచుకుపోయాడు?" అంటోందామె.

మందులోకన్నాట్ట! నాలుగాకులు అన్నాడుట (అబద్ధమంటుంది మా ఆవిడ). "చెట్టుకి చెట్టే మ్రోడు వుంచి ఆకు పట్టుకుపోయాడో" అని ఆవిడ కేకలు వేస్తోంది.

నేను ఓదార్చితే మా ఆవిడ నాకా పూట కడుపు తగుల్బు కొనేందుకు చిలక్కొయ్య ఇవ్వడం ఖాయం. నోరు మూసు క్కూర్చున్నాను!

"అయితే పిన్నిగారూ! వాడు డబ్బులు ఇవ్వకుండా పోయాడా?" మా ధనం అమాయకంగా, వేళాకోళంగా అడుగుతోంది.

రంగాజమ్మగారు చిందులు వేస్తూనే వుంది. ఇదో, పదో యిస్తాననే వుంటాడు వాడు. కాని, మేడ మీద ఈవిడ ఏ వేంకటేశ్వర స్తోత్రమో చేసుకుంటూ వున్నది కదాని, స్వామివారికి ప్రీతి అయిన పదార్థమేగానని-ఆమెకు పుణ్యం దక్కించాలని-అలా యిస్తానన్న నాలుగు డబ్బులూ ఎగేసి-ఎగిరిపోయాడన్నమాట!

నాకు లోపల లోపల సంతోషంగానే వుంది. నేను మారువేషం వేసుకుని అడుక్కో అక్కర్లేదుగా!!